గిరిజన గ్రామాల అభివృద్ధికి కృషి

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో ధర్తీ అబా జన్‌జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ కింద ఎంపికైన ఏడు గ్రామాల్లో అభివృద్ధి పనులను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పథకం అమలుపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 500 లేదా అంతకంటే ఎక్కువ జనాభా కలిగి అందులో కనీసం 50 శాతం గిరిజనులు నివాసం ఉంటే ఆ గ్రామంలో ధర్తీ అబా జన్‌జాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్‌ను అమలుచేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జిల్లాలో మంత్రాలయం మండలం పరమాన్‌దొడ్డి, నెరణికి, హోళగుంద మండలంలోని హోళగుంద, కోగిలతోట, మద్దికెర మండలంలోని పెరవళి, మద్దికెర (తూర్పు), హంప గ్రామాలను ఎంపిక చేసినట్లు వివరించారు. గిరిజన వర్గాల సామాజిక–ఆర్థిక పరిస్థితులను మెరుగు పరచేందుకే కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఎంపికైన గ్రామాల్లో 17 శాఖల ద్వారా వ్యక్తిగత, కమ్యూనిటీ స్థాయిలో ఇళ్లు, రోడ్లు, మౌలిక వసతుల కల్పన, వైద్యం, పోషకాహారం, విద్య, శిక్షణ, విద్యుదీకరణ, కనెక్టివిటీ తదితర సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకుకుంటున్నట్లు చెప్పారు. జూన్ 15వ తేదీ నుంచి ఈ పథకాన్ని అమలుచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి తులసిదేవి, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, హౌసింగ్ పీడీ చిరంజీవి, డీపీఓ వరలక్ష్మీ, డీఈఓ శామ్యూల్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా



హాజరైన అధికారులు

శిశుగృహ చిన్నారుల సంరక్షణపై శ్రద్ధ చూపండి

కర్నూలు(అర్బన్): శిశు గృహ కేంద్రంలోని చిన్నారులను సొంత పిల్లల్లా చూసుకుంటూ, వారిని కుటుంబ వాతావరణంలో పెంచాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా సూచించారు. ఆయన మంగళవారం స్థానిక సీ క్యాంప్‌లోని శిశు గృహ కేంద్రాన్ని తనిఖీ చేశారు. గృహం అంతా కలియతిరిగి ఉన్న సదుపాయాలు, పరిసరాలను పరిశీలించారు. లివింగ్ రూమ్, ఫీడింగ్ రూమ్, వంట గది, ఆఫీస్ రూమ్, టాయిలెట్స్, కంప్యూటర్ గదులను పరిశీలించి చిన్నారులకు డైరీ మిల్క్ చాక్లెట్లను అందించారు. గృహంలో ఎంత మంది చిన్నారులు ఉన్నారు, ప్రతి రోజు డాక్టర్లు పిల్లలను పరీక్షిస్తున్నారా? వారికి పాలు, ఇతర సంరక్షణ ఎలా ఉందని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అలాగే శిశు గృహం ప్రారంభమైనప్పటి నుంచి ఎంత మంది పిల్లలు ఉన్నారు, ఇప్పటి వరకు ఎంత మందిని దత్తత ఇచ్చారు? పిల్లలను చూసుకునేందుకు రాత్రి సమయాల్లో ఎవరు ఉంటారని ఇన్‌చార్జ్ మేనేజర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఇన్‌చార్జ్ మేనేజర్ మెహతాజ్‌బేగం స్పందిస్తూ 2006లో కేంద్రం ప్రారంభమైందని, ఇప్పటి వరకు 132 మందిని దత్తత ఇచ్చినట్లు తెలిపారు. అందులో ఇతర దేశాలకు 17 మందిని దత్తత ఇచ్చినట్లు కలెక్టర్‌కు వివరించారు. ప్రస్తుతం ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి మాత్రమే ఉన్నారని, ఒక అమ్మాయి మాట్లాడేందుకు ఇబ్బంది పడుతోందని అధికారులు చెప్పగా, వెంటనే స్పీచ్ థెరపీ చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. పిల్లల విషయంలో ఎలాంటి తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. శిశు గృహ కేంద్రంలో ప్రస్తుతం ఉన్న పిల్లలను దత్తత ఇచ్చేందుకు ఆన్‌లైన్ పోర్టల్‌లో వారి డేటాను ఎంట్రీ చేశారా ? దత్తత తీసుకున్న వారు పిల్లలను ఏ విధంగా చూసుకుంటున్నారో ఫాలో అప్ చేస్తున్నారా, అని ప్రశ్నించారు. కేంద్రంలో డ్రైనేజీ సమస్య ఉందని, ఫ్లోరింగ్ బాగా లేదని, భవనానికి పెయింటింగ్, మరమ్మతులు చేయించాలని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ పనులకు సంబంధించి ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈతో మాట్లాడి ఎస్టిమేట్స్ పంపాలని ఐసీడీఎస్ పీడీని ఆదేశించారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ఐసీడీఎస్ పీడీ పి.నిర్మల, జిల్లా బాలల సంరక్షణ అధికారిణి శారద తదితరులు ఉన్నారు.



శిశు గృహలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

నగర సుందరీకరణను పాడు చేస్తే చర్యలు

కర్నూలు (టౌన్): నగరంలో కూడళ్లపై, డివైడర్లపై, ప్రభుత్వ ఆస్తులపై పోస్టర్లు, బ్యానర్లు అతికించి నగర సుందరీకరణను పాడు చేస్తే సంబంధిత వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన కూడళ్లలో, డివైడర్ల మధ్యలోని స్తంభాలపై, గోడలపై బ్యానర్లు, పోస్టర్లు అతికించడం వల్ల లక్షలాది ప్రజాధనంతో చేపట్టిన సుందరీకరణను పాడు చేస్తున్నారని వాపోయరు. రాజకీయ పార్టీలు, మతపరమైన సంస్థలు, ఇతర ప్రైవేటు సంస్థలు నగరపాలక సంస్థకు సహకరించాలని కోరారు. అతిక్రమించిన వారిపై మున్సిపల్ కౌన్సిల్ సి.ఆర్. నంబర్ 78 ప్రకారం జరిమానా విధించడంతో పాటు చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనుమతి లేకుండా ప్రైవేటు ఆస్తులపై పోస్టర్లు, బ్యానర్లు అతికించినా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



కర్నూలు(రూరల్): మండల పరిధిలోని వెంకాయపల్లె గ్రామ సమీపంలో వెలసిన ఎల్లమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమావాస్య కావడంతో ముందుగా అమ్మవారి ఆలయాన్ని శుద్ధి చేశారు. అనంతరం భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో సింధూరార్చన



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయ స్వామి



అలంకరణలో మహా గౌరీ

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం అమావాస్యను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యసిద్ధి ఆంజనేయ స్వామికి అభిషేకం, సింధూరార్చన, ఆకుపూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహా గౌరీ అమ్మవారికి విశేష పూజలు జరిగాయి. నవగ్రహ, లక్ష్మీగణపతి, చండీ హోమం తదితర పూజలు నిర్వహించారు. ఆలయం ట్రస్ట్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మహనీయులను స్మరించుకోవాలి



నెహ్రూ, కందుకూరి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో మంగళవారం భారతదేశ మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్, ఉద్యోగులు, పాఠకులు జాతీయ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశం కోసం, సమాజం కోసం అహర్నిశలు పాటు పడిన మహనీయులను స్మరించుకోవాలన్నారు. కందుకూరి సాహిత్య రంగంలో సమూల మార్పులు తీసుకొచ్చారన్నారు. డ్రాయింగ్ మాస్టర్ సుధీర్ రాజు, ఉపాధ్యాయుడు యాగంటీశ్వరప్ప, డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క, ఉద్యోగులు పాల్గొన్నారు.

తైక్వాండో చాంపియన్‌గా కర్నూలు



విజేతలకు మెడల్స్ అందజేసిన సీఈఓ

కర్నూలు (టౌన్): స్థానిక కిడ్స్ వరల్డ్‌లోని రోశయ్య హాలులో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో చాంపియన్‌గా కర్నూలు జట్టు నిలిచింది. విజేతలకు మంగళవారం బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఒలింపిక్ సంఘం సీఈఓ విజయ్‌కుమార్, అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాసులు, తైక్వాండో సంఘం ఇన్‌చార్జ్ సతీష్‌కుమార్ పాల్గొని పతకాలు అందజేశారు. చాంపియన్‌గా నిలిచిన కర్నూలు తైక్వాండో క్రీడాకారులకు బంగారు, రజత పతకాలు, రెండవ స్థానంలో నంద్యాల క్రీడాకారులు, మూడవ స్థానంలో ఎమ్మిగనూరు క్రీడాకారులు నిలిచారు. వారికి నిర్వాహకులు ట్రోఫీలు అందజేసి అభినందించారు. తైక్వాండో శిక్షకులు వీరేష్‌బాబు, శివన్న, ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రమాబాయి కృషి మరువలేనిది



రమాబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మహిళా నేతలు

కర్నూలు(అర్బన్): బాబా సాహెబ్ అంబేడ్కర్ చేసిన పోరాటంలో ఆయన సతీమణి రమాబాయి చేసిన కృషి మరువలేనిదని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి, రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి అన్నారు. మంగళవారం రమాబాయి 90వ వర్ధంతి సందర్భంగా స్థానిక వేదిక కార్యాలయంలో ఆమె చిత్రపటానికి మహిళా నేతలు పూలమాల వేసి నివాళి అర్పించారు. వారుమాట్లాడుతూ..రమాబాయి త్యాగాల పునాదులపై బీఆర్ అంబేడ్కర్‌ను ఒక మేరు పర్వతంలా నిలబెట్టారన్నారు. అంబేడ్కర్‌కు ఎల్లవేళలా తోడుగా ఉంటు అనేక కష్టాలను అనుభవిస్తూ జీవితం సాగించడం రమాబాయి ఆత్మస్థైర్యానికి నిదర్శనమన్నారు. జిల్లా అధ్యక్షురాలు పాలెం రాధ తదితరులు పాల్గొన్నారు.

ఎండీయూ ఆపరేటర్లను కొనసాగించాలి

పత్తికొండ రూరల్: రేషన్ సరుకులను ఇంటింటికీ అందజేస్తున్న ఎండీయూ ఆపరేటర్లను కొనసాగించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు చక్రాళ్ల వెంకటేశ్వరరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ కూడలి నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు మొబైల్ వ్యాన్లతో ర్యాలీగా వెళ్లి ఆందోళన చేపట్టారు. ఎండీయూ ఆపరేటర్లను తొలగించాలనుకునే ఆలోచన విరమించుకోవాలన్నారు. దీని వల్ల వేల సంఖ్యలో నిరుద్యోగులు రోడ్డున పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీఓ భరత్‌నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ నాయకుడు దస్తగిరి, ఎండీయూ ఆపరేటర్లు రామ్మోహన్‌రెడ్డి, మధుబాబు, హమీద్, బాలరాజు, జయ, నరసింహులు పాల్గొన్నారు.

యోగాంధ్రపై విస్తృత ప్రచారం



మాట్లాడుతున్న జేసీ డాక్టర్ బి.నవ్య



యోగాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

కర్నూలు(సెంట్రల్): యోగాంధ్ర కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని జేసీ డాక్టర్ బి.నవ్య సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో యోగాంధ్ర-2025, యోగా సాధన, అవగాహన మాసోత్సవాలపై జేసీ సోషల్ మీడియా కార్యకర్తలతో సమీక్షించారు. మే 21 నుంచిజూన్ 21వ తేదీ వరకు ప్రతిరోజూ యోగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత సోషల్ మీడియాపై ఉందన్నారు. డాక్టర్ ఆంజనేయులు, డాక్టర్ కేవీఆర్ ప్రసాదు, సైకాలజిస్టు జ్యోతిర్మయి హాజరై సోషల్ మీడియా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. జిల్లా టూరిజం అధికారి విజయ, జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్‌పాల్, మెప్మా పీడీ నాగశివలీల తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు (టౌన్): యోగా సాధన ద్వారా ఆరోగ్యం లభిస్తుందని నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు అన్నారు. మంగళవారం యోగాంధ్ర క్యాంపెయిన్‌లో భాగంగా స్థానిక ఔట్‌డోర్ స్టేడియం నుంచి కొండారెడ్డి బురుజు వరకు నిర్వహించిన మాస్ ర్యాలీని కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వచ్చే నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని దేశ ప్రధాని నరేంద్ర మోదీ సమక్షంలో విశాఖపట్నం సముద్రతీర ప్రాంతంలో 5 లక్షల మందితో యోగా సాధన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారన్నారు. డీఎస్‌ఓ రాజా రఘువీర్, సెట్కూర్ సీఈఓ డాక్టర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు (టౌన్): స్థానిక బిర్లా కాంపౌండ్ సమీపంలోని ఖానా–ఖజానా వద్ద నగరపాలక మేనేజర్ చిన్నరాముడు ఆధ్వర్యంలో యోగాసనాలపై ఉచిత శిక్షణను ప్రారంభించారు. బిర్లా కాంపౌండ్ వద్ద ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు యోగాసానాలను ఉచితంగా నేర్పిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎమర్జెన్సీ మెడిసిన్ సేవలు కీలకం



క్యాజువాలిటీలో కేక్ కట్ చేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రిలో అత్యవసర వైద్యం కోసం వచ్చే రోగులకు ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం వైద్యులు ప్రధానమని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు చెప్పారు. మంగళవారం ఎమర్జెన్సీ మెడిసిన్ డే సందర్భంగా ఆసుపత్రిలోని ఆ విభాగం (క్యాజువాలిటీ)లో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రికి వచ్చే రోగులకు ప్రతిరోజూ 24 గంటల పాటు ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం వారు అందిస్తున్న సేవలు అమూల్యమైనవని, ఎంతో మంది ప్రాణాలు కాపాడటంలో వారి పాత్ర ముఖ్యమని అన్నారు. అత్యవసర పరిస్థితులు వచ్చినప్పుడు, రోగులకు తక్షణ వైద్యసహాయం అందించేందుకు వైద్యులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. అనెస్తీషియా ప్రొఫెసర్ డాక్టర్ రామశివనాయక్, డాక్టర్లు సుధీర్, రామకృష్ణనాయక్, సుబ్రహ్మణ్యం, ఫయాజ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అడ్డదారిలో మరో ఐదేళ్లు


- వీఏఎస్ యత్నాలు సఫలం
- జిల్లా పశుసంవర్ధక శాఖలో లీలలు



సతీష్‌కుమార్ కర్నూలులో ఎనిమిదేళ్లకుపైగా పనిచేసినట్లు ట్రైనింగ్ సెంటర్ ఏడీ సుధాకర్‌రెడ్డి ఇచ్చిన సర్టిఫికెట్

కర్నూలు(అగ్రికల్చర్): పశుసంవర్ధక శాఖలో ఓ అసిస్టెంటు సర్జన్ అడ్డదారిలో మరో ఐదేళ్లు బదిలీ లేకుండా కర్నూలులోనే కొనసాగేందుకు ప్రయత్నించడం, అధికారులు ఆయనకు అనుకూలంగా వ్యవహరిస్తుండటం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆయన కర్నూలులో ఎనిమిదేళ్లకుపైగా పనిచేసి ఉండటం గమనార్హం. వివరాలు.. కర్నూలు బహూశార్ధ పశు వైద్యశాలలోని పశుసంవర్ధక శాఖ ట్రైనింగ్ సెంటరులో డాక్టర్ ఎస్.సతీష్‌కుమార్ మూడేళ్లకుపైగా పనిచేస్తున్నారు. అంతకుముందు కలెక్టరేట్ పక్కనున్న వెటర్నరీ డిస్పెన్సరీలో ఐదేళ్లు పనిచేశారు. ట్రైనింగ్ సెంటరులో బదిలీ లేకుండా ఎనిమిదేళ్లు కొనసాగే అవకాశం ఉంది. ప్రస్తుతం కర్నూలులో ఉన్న ట్రైనింగ్ సెంటరు 2021 వరకు ఎమ్మిగనూరు మండలం బనవాసిలో ఉండేది. 2021 డిసెంబరు 6న కర్నూలులోని బహూశార్ధ పశు వైద్యశాలకు షిఫ్ట్ అయ్యింది. ఈయన బుధవారపేట వెటర్నరీ డిస్పెన్సరీ నుంచి ట్రైనింగ్ సెంటరుకు బదిలీ అయ్యారు. అప్పటికే ట్రైనింగ్ సెంటరు కర్నూలులో నడుస్తోంది. అయితే జీతాల బిల్లులు మాత్రం అప్పట్లో కొన్ని నెలల పాటు ఎమ్మిగనూరు సబ్ ట్రెజరీకి వెలుతుండేవి. డ్రాయింగ్ ఆఫీసర్ వాటిని ఆన్‌లైన్ ద్వారా అప్‌లోడ్ చేస్తారు. ఈయన ఒక్కరోజు కూడా ఎమ్మిగనూరుకు వెళ్లింది లేదు. 'వేతనాల బిల్లులు ఎమ్మిగనూరుకు పోతున్నందున నా సర్వీస్ బ్రేక్ అయింది. కావున ట్రైనింగ్ సెంటరులోనే ఇంకా ఐదేళ్లు కొనసాగవచ్చనే వాదనను తెచ్చారు'. బుధవారపేట, ట్రైనింగ్ సెంటరులో కలిపి ఒకే స్టేషన్‌లో ఈ నెల 31వ తేదీ నాటికి 8 ఏళ్ల 2 నెలల, 24 రోజులు పని చేసినట్లు ట్రైనింగ్ సెంటరు సహాయ సంచాలకులు డాక్టర్ సుధాకర్‌రెడ్డి సర్టిఫై కూడా చేశారు. దీనిని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి విధిగా పరిగణలోకి తీసుకోవాలి. ఈయన స్థానాన్ని ట్రైనింగ్ సెంటరులో ఖాళీ కింద చూపాలి. రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్‌కు పంపిన ఖాళీల జాబితాలో ఈ పోస్టును చూపకపోవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై కొందరు డాక్టర్లు డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది.

పారిశుద్ధ్య పనులు చేపట్టండి



సర్పంచ్ పద్మావతమ్మతో కలిసి మొక్కను నాటుతున్న డీపీఓ జి.భాస్కర్

కల్లూరు: జిల్లాలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు పక్కాగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి జి.భాస్కర్ డిప్యూటీ ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. కల్లూరు మండలంలో మోడల్ విలేజ్‌గా ఎంపికైన పెద్దటేకూరులో మంగళవారం డీపీఓ పర్యటించారు. ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి నీళ్లు పోశారు. గ్రామంలో మూడు రోజుల పాటు పారిశుద్ధ్య పనుల ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని డీపీఓ అధికారులకు సూచించారు. వ్యర్థరహిత గ్రామంగా తీర్చిదిద్దడమే కార్యక్రమ ఉద్దేశమన్నారు. గ్రామంలో అన్ని వీధులను శుభ్రంగా ఉంచాలని డిప్యూటీ ఎంపీడీఓ నాగేష్, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. పారిశుద్ధ్యం లోపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్పంచ్ పద్మావతమ్మ, పలువురు డిప్యూటీ ఎంపీడీఓలు, డీపీఆర్సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూ సేవలు ఎనలేనివి

కర్నూలు(సెంట్రల్): భారతదేశానికి మొదటి ప్రధానమంత్రిగా నెహ్రూ చేసిన సేవలు ఎనలేనివని, ఆయన హయాంలో ఎన్నో పరిశ్రమలను స్థాపించి యువతకు ఉపాధి మార్గాలు చూపారని కర్నూలు నగర కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్‌జిలానీ బాషా పేర్కొన్నారు. మంగళవారం నెహ్రూ 61వ వర్ధంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించి సేవలను కొనియాడారు. నాయకులు దామోదరం రాధాకృష్ణ, బతుకన్న, డీవీ సాంబశివుడు, షేక్‌ఖాజా హుస్సేన్, అనంతరత్నం మాదిగ పాల్గొన్నారు.

ఈరన్నస్వామికి అమావాస్య పూజలు



పూజలందుకుంటున్న ఈరన్నస్వామి

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయానికి వేలాది మంది భక్తులు తరలిరావడంతో సందడిగా నెలకొంది. మంగళవారం అమావాస్య ఉండడంతో తమ ఇంటి ఇలవేల్పును దర్శంచుకోవాడానికి తరలివచ్చారు. సోమవారం సాయంత్రం నుంచే స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. దర్శనం కోసం గంటకు పైగా సమయం పట్టింది. తెల్లవారు జామున 4 గంటలకు అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. అమావాస్య సందర్భంగా లక్ష పుష్పార్చన పూజలు చేపట్టడంతో భక్తులు ఈ పూజల్లో పాల్గొని భక్తిని చాటుకున్నారు.

బుదుములదొడ్డిలో..

ఉరుకుంద సమీపంలోని బుదుములదొడ్డి ఆంజినేయస్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా భక్తుల సందడిగా నెలకుంది. ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో ఆంజినేయస్వామిని దర్శనానికి కూడా తరలివచ్చారు. అలాగే తుంగభద్ర నది ఒడ్డున మేళిగనూరు గ్రామంలో వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయం అమావాస్య వేడుకలతో భక్తులు అధికంగా తరలివచ్చారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు.

ప్రమోషన్లలో కక్ష సాధింపు ఆపండి

ఆదోని సెంట్రల్: ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల ప్రమోషన్లలో కక్ష సాధింపు చర్యలు ఆపాలని రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు జి.వి.ఉజ్వల్, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ఎల్లన్న, రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ హెచ్.రామచంద్ర అన్నారు. మంగళవారం వారు స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యాశాఖలో పరిషత్ ప్రధానోపాధ్యాయుల ప్రమోషన్లలో ఎస్సీ, ఎస్టీ స్కూల్ అసిస్టెంట్లకు అన్యాయం జరిగిందని, జీఓ నంబర్ 2 ప్రకారం రోల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకుండా అన్యాయంగా హెచ్ఎంల పదోన్నతులు నిర్వహించాలని చూస్తున్నారన్నారు. 360 మంది స్కూల్ అసిస్టెంట్లను వెరిఫికేషన్ కోసం పిలిచిన విద్యాశాఖ ఎస్సీ, ఎస్టీల గురించి ఎలాంటి ప్రస్తావన చేయకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల ప్రమోషన్లను సక్రమంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఫోరం రామాంజనేయులు మాదిగ, స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు నరేష్ పాల్గొన్నారు.

1 నుంచి దుకాణాల ద్వారా రేషన్ పంపిణీ

కర్నూలు(రూరల్): వచ్చే నెల 1 నుంచి రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ చేయనున్నట్లు కర్నూలు రూరల్ తహసీల్దారు టీవీ రమేష్ బాబు తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ ఇప్పటి వరకు వాహనాల ద్వార ఇళ్ల వద్దకే రేషన్ పంపిణీ చేశామన్నారు. ఇక నుంచి కార్డుదారులు రేషన్ దుకాణాలకు వచ్చి రేషన్ తీసుకోవాలని సూచించారు. రేషన్ దుకాణాలు రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు తెరచి ఉండాలన్నారు. 65 ఏళ్లు పైబడిన వారికి, విభిన్న ప్రతిభావంతులకు ఇంటి వద్దే రేషన్ పంపిణీ జరుగుతుందన్నారు.

● వికసించిన మే పుష్పం



ఏడాదికి ఒకసారి మాత్రమే వికసించే అరుదైన మే పుష్పం మంగళవారం కనువిందు చేసింది. కర్నూలులోని ఏ క్యాంపు ప్రాంతంలో డాక్టర్ జి.ఉమాదేవి నివాసంలో మే పుష్పం వికసించడంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

తుప్పు.. ముప్పు



స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ భవనం ముందు ఉంచిన పాత సామగ్రి

శరీరంలో ఏర్పడిన క్యాన్సర్‌ను తొలగించేందుకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కొత్తగా స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేశారు. అయితే అధికారులు మాత్రం క్యాన్సర్ సెంటర్ ముందే పాత సామాను పారబోయడంతో నూతన భవనం వికారంగా కనిపిస్తుండగా.. మరోవైపు ఇనుముకు ఏర్పడిన తుప్పును తినేందుకు పాములు, విష పురుగులు అక్కడికి చేరుతున్నాయి. దీంతో ఆ ప్రాంతంలో తిరగాలంటే రోగులు, వారి సహాయకులు, వైద్యులు, సిబ్బంది భయపడుతున్నారు. ఆసుపత్రిలో పేరుకుపోయిన పాత సామానును టెండర్ ద్వారా ఓ వ్యక్తి తీసుకెళ్లేందుకు అధికారులు అనుమతించారు. కానీ ధర గిట్టుబాటు కావడం లేదని కొంచెం సామాను మాత్రమే తీసుకెళ్లి మిగిలినది అక్కడే వదిలేసి వెళ్లారు. ఈ సామానును ఇతర ప్రాంతానికి తరలించాలని ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులు కోరుతున్నారు. – కర్నూలు(హాస్పిటల్)

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



కాటసాని రాంభూపాల్‌రెడ్డిని శాలువాతో సత్కరిస్తున్న పార్టీ నాయకులు

కల్లూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో వివిధ విభాగాల్లో పదవులు పొందిన వారు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సూచించారు. వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన జెట్టి ప్రభుదాస్, గడివేముల మండల కమిటీలో నియమితులైన మంగే నాయక్, పి.అంజన్ నాయక్ మంగళవారం కాటసాని రాంభూపాల్ రెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. పార్టీలో కష్టపడి పని చేసిన వారికి తప్పనిసరిగా పదవులు వరిస్తాయన్నారు. రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం, మండల, ఇతర స్థాయిలో పదవులు పొందిన నాయకులందరూ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా పని చేయాలన్నారు. అందరినీ కలుపుకొని పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఎ.హనుమంతురెడ్డి, గడివేముల వైస్ ఎంపీపీ బి.కాలునాయక్, తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

తుగ్గలి: కడుపునొప్పి తాళలేక ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున తెలిపిన వివరాల మేరకు.. ఉప్పర్లపల్లికి చెందిన పి. కృష్ణవేణి (47) రెండేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతోంది. భర్త రామచంద్ర పలు ఆస్పత్రుల్లో చూపించినా ప్రయోజనం లేకపోయింది. సోమవారం కెమికల్ ద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన భర్త గుత్తికి తరలించాడు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పత్తికొండ మండలం హోసూరుకు చెందిన కృష్ణవేణికి 25 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. సంతానం లేదు. మృతురాలి సోదరుడు జయ రాముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మంగళవారం విలేకరులకు తెలిపారు.

బది'లీల'లెన్నో?

- కొత్తగా పుట్టుకొస్తున్న ఆఫీసు బేరర్లు
- గతంలోనే కో-ఆప్షన్ చేసుకున్నట్లుగా అడ్డగోలుగా లేఖలు
- ముడుపులతో జేబులు నింపుకుంటున్న నేతలు

కర్నూలు(అగ్రికల్చర్): బదిలీలపై నిషేధం ఎత్తివేశారంటే గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాలకు పండగే. బదిలీల నుంచి తప్పించుకొని పనిచేసే చోటనే కొనసాగేందుకు ఉద్యోగ సంఘాల్లో ఆఫీసు బేరర్లుగా ఉన్నట్లుగా లేఖలు పుట్టుకొస్తున్నాయి. రెండేళ్ల క్రితమే కో-ఆప్షన్ చేసుకున్నామంటూ దర్జాగా లేఖలు ఇస్తూ జేబులు నింపుకుంటున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగ సంఘం నాయకులు అడ్డగోలుగా ఆఫీసు బేరర్లు అంటూ లేఖలు ఇస్తుండటం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. జిల్లా, తాలూకా స్థాయిలో ఆఫీసు బేరర్లుగా అప్పటికప్పుడు లేఖలు తెచ్చుకొని బదిలీల నుంచి తప్పించుకుంటున్నారు.

గుర్తింపు పొందిన సంఘాల్లోని ఆఫీసు బేరర్లకు తొమ్మిదేళ్ల వరకు బదిలీలు లేవు. కొంతమంది తొమ్మిదేళ్లు గడచిపోయినప్పటికీ పనిచేసే చోటనే కొనసాగేందుకు మార్గాలను అన్వేషించుకుంటున్నారు. వ్యవసాయ శాఖలో ఇద్దరికి ఆఫీసు బేరర్లుగా లెటర్లు ఇవ్వడం చర్చనీయాంశం అయ్యింది. సంఘంలో కనీసం ఓటర్లు కాని వారు కూడా ఆఫీసు బేరర్లుగా మారిపోయారు. ముడుపులు పుచ్చుకొని ఆర్ అండ్ బీలో ఒకరికి, పే అండ్ అకౌంట్స్ కార్యాలయంలో ఇద్దరికి ఆఫీసు బేరర్లంటూ లేఖలు ఇచ్చినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ నేతలు కూడా జిల్లా, తాలుకా యూనిట్‌లలో ఆఫీసు బేరర్లంటూ పలువురికి లేఖలు ఇచ్చినట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. ఏపీ ఎన్జీఓ అసోషియేషన్ నేతలు జిల్లా, తాలూకా అఫీసు బేరర్లంటూ కలెక్టర్‌కు లేఖలు ఇచ్చారు. కలెక్టర్ వీటిని ఆమోదించకుండా మరిన్ని వివరాలు కోరడం చర్చనీయాంశం అయ్యింది. జిల్లా సంఘం నుంచి నలుగురిని సస్పెండ్ చేశారు. వీరు రాష్ట్ర సంఘానికి అప్పీల్ చేసుకుంటే కొనసాగేందుకు అవకాశం లభించింది. జిల్లా ఆఫీసు బేరర్ల పేర్లలో వీరి పేర్లను చేర్చలేదు. దీంతో రాష్ట్ర సంఘం నుంచి ప్రొసీడింగ్స్ తెచ్చుకున్న నాయకులు తాము కూడా అసోసియేషన్‌లో ఉన్నామని కలెక్టర్‌కు విన్నవించుకోవాల్సి వచ్చింది. ఆఫీసు బేరర్లుగా తొమ్మిదేళ్లు గడచిన వారిని బదిలీ చేయాలని ఈ నేతలు డిమాండ్ చేస్తుండటం గమనార్హం.